ప్రజాపాలన ముసుగులో రాక్షసపాలన

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదు
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: దశరథ్‌నాయక్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ముసుగులో రాష్ట్రంలో రాక్షసపాలనను కొనసాగిస్తున్నదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండిపడ్డారు. కుట్రపూరితంగా బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నదన్నారు. గురువారం మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలు గమనించారని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పి, సరిపడా బస్సులు నడపకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి, కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తున్నదని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు కేసులకు భయపడితే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని ఆయన ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం అరెస్ట్ చేసిన ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలు, తండాల్లో పాలన అస్తవ్యస్తమైందన్నారు.

దశరథ్‌నాయక్‌కు సన్మానం

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్‌ను మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, శంకర్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, మాజీ ఎంపీటీసీ ప్రియారమేశ్‌నాయక్, నాయకులు బాలకృష్ణ, శంకర్, నర్సింహ, పాండు, కృష్ణయ్య, లాయక్‌అలీ, గణేశ్, రాజు, భీమన్, శ్రీను, సాయి, ఎల్లాగౌడ్, రమేశ్, లక్ష్మయ్య, గోపాల్, జైపాల్, జంగయ్య, యాదయ్య, చందు, శ్రీకాంత్, అంజి, జగన్, కుమార్, రాజా, బన్సీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 5 : ప్రజాపాలనలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న నాయకులను అక్రమ అరెస్టు చేయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ అరెస్టును ఖండిస్తూ గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కేవలం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టులపై దృష్టి సారించిందన్నారు. అధికారంలో లేకపోయిన ప్రజల పక్షాన ప్రభుతాన్ని నిలదీస్తామన్నారు. ప్రజల పక్షాన పని చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీగా బీఆర్‌ఎస్‌పై ఉందనే విషయాన్ని అధికార పార్టీ గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. దేశానికే తలమానికంగా మారిన మిషన్ కాకతీయ, కాళేశ్వరం తదితర పథకాలను అమలు చేయడంతోపాటు, ఓటమి ఎరగని నాయకుడిగా పేరొందిన మాజీ మంత్రి హరీశరావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య
- మర్పల్లి జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

మర్పల్లి జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య

మర్పల్లి, డిసెంబర్ 5 : మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్షం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. బుధవారం నాసిరకం బియ్యంతో వండిన మధ్యాహ్న భోజనాన్ని తినలేక పడేసిన విద్యార్థులు అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం ముద్దలుగా కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలలకు వచ్చే బియ్యమే ఇక్కడికి వస్తుందని, ఇక్కడ ఎందుకు అన్నం ముద్దలు అవుతున్నదని మండిపడ్డారు. గదిలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఉన్న బియ్యం బస్తాలను మోమిన్‌పేట (సివిల్ సప్లై) గోదామ్‌కు పంపించి అక్కడి నుంచి వేరే బియ్యం తెప్పించినట్లు వారు గుర్తించారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి వెంట జూనియర్ అసిస్టెంట్ షఫీ, ఆర్‌ఐ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు కుంటబడి విద్యార్థి ఎంపిక

విద్యార్థిని అహ్మదికాతూన్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ

షాద్‌నగర్ రూరల్, డిసెంబర్ 5 : రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు షాద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కుంటబడి) విద్యార్థి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానపాధ్యాయురాలు భాగ్యమ్మ హర్షం వ్యక్తం చేశారు. నవంబర్ 29, 30 తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో మల్టీపర్పస్ మోటర్ అనే ప్రదర్శనలో పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి అహ్మదికాతూన్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట స్థాయి అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అహ్మదికాతూన్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. రాష్టస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు పట్టణానికి చెందిన విద్యార్థి ఎంపిక కావడంపై స్థానికులు సం తోషం వ్యక్తం చేశారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

- ప్రజా సమస్యలను గాలికొదిలేసిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య
- హైదరాబాద్ బీజాపూర్ హైవే నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం
- ఇంకెందరి ప్రాణాలు పొట్టన పెట్టుకుంటారోనని విమర్శ
- తీవ్రంగా మండిపడ్డ బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథ్

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 5 : మాయమాటలు, అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఏడాది గడిగిచినా ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైనదని, ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి సోయి లేదని బీఆర్‌ఎస్‌వీ (భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హైదరాబాద్ బీజాపూర్ రహదారిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై చేవెళ్లలో గురువారం చటారి దశరథ్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఆలూర్ ఘోర రోడ్డు ప్రమాదం చాలా విషాదకరమని, రోడ్డు నిర్మాణ ప్రారంభ విషయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య చొరవ తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేసి కనీసం రోడ్డు ప్రస్తావన తేకపోవడం సరిరాదన్నారు. ఇంకెంతమంది అమాయక ప్రజల ప్రాణాలు తీసి రోడ్డు పనులు ప్రారంభిస్తారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రయాణించే రోడ్డు పరిస్థితి ఇలా దాపురిస్తే రాష్ట్రంలోని రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లే వలస పక్షి ఎమ్మెల్యే యాదయ్య అని, తిన్న ఇంటి వాసాలు లెక్కించే ఆనవాయితీ ఉన్న వ్యక్తికి ప్రజా స్వామ్యంలో విలువలు ఉండవన్నారు. వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా, ప్రజా ప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇచ్చి ఎమ్మెల్యే చేతులు దులుపుకోవడంతో వారి కుటుంబాలకు స్వాంతన చేకూరుతుందా అని ప్రశ్నించారు. చేయాల్సిన అభివృద్ధి పనులను గాలికొదిలేసి, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే ఊరుకునేది లేదని, ఖబర్దార్ యాదయ్య అని హెచ్చరించారు. హైదరాబాద్ బీజాపూర్ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేంత వరకు బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పోరాటాలు ఆగవన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు బ్యాగరి సుదర్శన్, ఆసిఫ్, నరేష్, పృథ్వీ, తేజ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

శంకర్‌పల్లి బాలికల పాఠశాలను సందర్శించిన గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి వర్షిణి

మొయినాబాద్, డిసెంబర్ 5 :విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. గురువారం రాత్రి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న శంకర్‌పల్లి ఎస్సీ బాలికల పాఠశాల, చిలుకూరులో ఉన్న ఎస్సీ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆమె పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించి పాఠశాలలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడారు. ల్యాబ్‌లు లేకపోవడంలో చదువుకోవడం కష్టంగా ఉందని బాలికలు చెప్పారు. ఇంటర్ మొదటి ఏడాది నుంచే తమకు నీట్, ఎంసెట్ కోచింగ్ ఇవ్వాలని విద్యార్థినులు అడిగారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ గదిని చూడగా ఫ్లోర్ బండలు పూర్తిగా కుంగిపోయాయి. వెంటనే ఫ్లోర్ బండలు సరి చేయించాలని, ఇందుకు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి నివేదిక పంపాలని సూచించారు. అనంతరం చిలుకూరులో ఉన్న బాలుర పాఠశాల వసతి గృహన్ని సందర్శించారు. విద్యార్థులతో భోజనం చేశారు.

ఎక్కడి పనులు అక్కడే!

- ముందుకు సాగని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణం
- పట్టించుకోని పాలకులు
- ఒక్కో మున్సిపాలిటీకి రూ.2కోట్లు కేటాయించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ఆదిబట్లలో అసంపూర్తిగా మార్కెట్ యార్డు నిర్మాణం పనులు

ఆదిబట్ల, డిసెంబర్ 3 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మున్సిపాలిటీల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధికి సంబంధించి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో తేడా కనిపిస్తున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధిలో భాగంగా ప్రతి మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ సముదాయాల నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో వీటి నిర్మాణం చేపట్టడంపై అప్పట్లో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని ప్రజలకు సౌకర్యార్థం ఒకే దగ్గర అన్ని వసతులు కల్పించేందుకు ఈ మార్కెట్ల భవన నిర్మాణాలను మంజూరు చేసింది. అందులో భాగంగానే ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో మాడల్ మార్కెట్ నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. అప్పటి వరకు మార్కెట్ నిర్మాణం పనులు చక చకా కొనసాగాయి. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లే చందంగా మారింది. కనీసం మార్కెట్ నిర్మాణం పనులను పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.

ఒకే గొడుగు కిందకు అన్ని దుకాణ సముదాయాలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌కు వెళ్లే దారిలో సర్వే నంబర్ 442లో ప్రభుత్వం సమీకృత మాడల్ మార్కెట్ నిర్మాణానికి 2 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇందులో సమీకృ త మాడల్ మార్కెట్ నిర్మాణ పనులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఒకే గొడుగు కింద మాంసం, కూరగాయలు, పూలు, పండ్లు అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. ప్రతి దానికి వేర్వేరుగా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం కూరగాయలకు 14, మాంసం విక్రయానికి 14 షాపుల చొప్పున కేటాయించారు. చుట్టూ నిర్మాణం మధ్యలో ఖాళీ స్థలంలో పూలు, పండ్లు అమ్ముకోవడానికి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. అప్పటి ప్రభుత్వం హయాంలోనే చేపట్టిన పనులు అక్కడే ఆగి పోయాయి. ఇప్పటివరకు ఆ పనులు ఎలా జరుగుతున్నాయని పట్టించుకొనే వారే కరువయ్యారు.

ఎంతో మందికి ఉపాధి అవకాశాలు

ఆదిబట్ల మున్సిపాలిటీలో మాడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 200 నుంచి 400 మంది వరకు పైగా చిరువ్యాపారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి ప్రత్యేక చొరవ చూపక పోవడంతో మార్కెట్ పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం అందించే ప్రత్యేక నిధులతో మార్కెట్ నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫంక్షన్ హాలా.. పుర కార్యాలయమా..

ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును ఆదిబట్ల గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా ఫంక్షన్ హల్‌కు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. లేనిపక్షంలో ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయానికి కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం వస్తున్నది. నిధులు ఉన్నా పట్టించుకునే వారు లేక పోవడంతో మార్కెట్ యార్డ్ పనులు ముందుకు సాగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి వెంటనే పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సమతుల్యమైన ఎరువులతో అధిక దిగుబడులు

ఆమనగల్లు, డిసెంబర్ 5 : సమతుల్యమైన ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఆమనగల్లు మండల పరిధిలోని రాంనూంతల గ్రామంలో వ్య వసాయ శాఖ, ఆచార్య జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. భూసార పరీక్షల అవశ్యకృత, ఎరువులు వాడే విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ అదిలక్ష్మి, ఎంపీడీవో కు సుమమాధురి, ఏవో శ్రీనివాస్‌గౌడ్, ఏఈవో నిఖిత, శాస్త్రవేత్తలు రాజేశ్వర్, రామకృష్ణబాబు, పవన్‌చంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

ఆమనగల్లు మండల పరిధిలోని పోలేపల్లిలో ఉన్న అభిషేక్ కాటన్ జిన్నింగ్ మిల్లును డీఏ వో నర్సింహారావు తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు రాకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు.

పచ్చిరొట్టతో పెరగనున్న నేల సారవంతం

పరిగి: పచ్చి రొట్ట ఎరువులు జనుము, జీలుగ, పిల్లి పెసర వేసి కలియదున్నితే నేలలో సారవంతం పెరుగుతుందని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం నస్కల్ రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈవో మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా మట్టి నమూనాలు సేకరించి పరీక్ష చేయించాలని, తద్వారా భూమిలో ఏ పోషకాల ల భ్యత ఉంది, ఎలాంటి పోషకాలు వేయాల్సి న అవసరం ఉంటుందో తెలుస్తుందన్నారు. అందుకు అనుగుణంగా ఎరువులు వాడితే స రిపోతుందని, పచ్చి రొట్ట ఎరువులను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఏడీఏ లక్ష్మీకుమారి మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చితే పర్యావరణానికి తీవ్ర ముప్పు అని తెలిపారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు ఎలా సేకరించాలో స్వయంగా చేసి చూపించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కావ్య, రైతులు దండు అశోక్, వెంకటయ్య, ముత్యూరి చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

తప్పు ఎవరిది? శిక్ష ఎవరికి?

- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు
- అక్రమార్కుడికి అండగా నిలుస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారులు
- అధికార పార్టీ ఎమ్మెల్యే సహకారంతో ప్లాట్‌ను కబ్జా చేసేందుకు బిల్డర్ యత్నం
- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా.. ఆగని దౌర్జన్యం
- గచ్చిబౌలి ఎఫ్‌సీఐ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కేంద్రంగా దుర్మార్గం
- అధికారుల తీరుపై సర్వత్రా చర్చనీయాంశం

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కాయకష్టం చేసుకుని పైసా..పైసా కూడబెట్టి..ఇంటి కలను నెరవేర్చుకునేందుకు అనుమతి తీసుకుని ఇంటి నిర్మాణ పనులు మొదలు పెడితే వివాదాస్పద బిల్డర్ ఆ స్థలంపై కన్నేశారు. కబ్జాకోరు, వివాదాస్పద బిల్డర్ అయిన సంధ్య కన్‌స్ట్రక్షన్స్ ఎండీ సరనాల శ్రీధర్‌రావు ఇందుకు రంగారెడ్డి జిల్లాలోని సీనియర్ ఎమ్మెల్యే సహకారం తీసుకుని బలవంతంగా లాగేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిర్మాణ జరుగుతున్న ప్లాట్‌లోకి అక్రమంగా చొరబడి, అందులో ఉన్న సామగ్రిని ధ్వంసం చేసి ప్లాటు కబ్జాకు యత్నించడంపై సదరు శ్రీధర్ రావుపై ఇటీవల గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినా వెనక్కి తగ్గకుండా శ్రీధర్ , అధికార పార్టీ ఎమ్మెల్యేతో కలిసి అధికారులపై ఒత్తిడి పెంచి మరీ ఈ స్థలంలో నిర్మాణ పనులకు అడుగడుగునా అడ్డుతగులుతుండడం గమనార్హం. వాస్తవం ఏమిటంటే అధికారులు సైతం అక్రమార్కుడికి కొమ్ముకాస్తూ అమాయక నిర్మాణదారుడి స్థలంపై బుల్డోజర్లు దింపడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే...

గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలంలో వి. దేవరాజ్, వి. కల్యాణిల పేరుతో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి 2022లో దరఖాస్తు చేసుకున్నారు. స్థలం డాక్యుమెంట్లు, పర్మిషన్‌కు సంబంధించి సిల్ట్ + 5 అంతస్తుల నిర్మాణానికి ప్లాన్ పరిశీలించి టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. పర్మిట్ నంబరు 2046/జీహెచ్‌ఎంసీ/ఎస్‌ఎల్‌పీ/2022(ఫైల్ నం 005050) పేరుతో ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతి రాగానే సదరు నిర్మాణదారుడు దేవరాజ్ ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ ఎఫ్‌సీఐ కాలనీ హౌసింగ్ సొసైటీపై పెత్తనం చెలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్ రావు బలవంతంగా దేవరాజ్ స్థలాన్ని తీసుకునే కుట్రకు తెరలేపాడు. దేవరాజ్‌ను పలు విధాల ఒత్తిళ్లు పెంచి మానసిక క్షోభకు గురి చేశాడు. అనేకసార్లు ప్లాట్‌లోకి చొరబడి నిర్మాణ సామగ్రికి చల్లాచెదురు చేశాడు. ఈ నేపథ్యంలో గత నెల 27న శ్రీధర్ రావుపై దేవరాజ్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అయినప్పటికీ శ్రీధర్ రావు వెనక్కి తగ్గకుండా గురువారం అధికార పార్టీ ఎమ్మెల్యే సహకారంతో శేరిలింగంపల్లి ముఖ్య అధికారులపై ఒత్తిడి పెంచి నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇదేక్కడి అన్యాయమని టౌన్‌ప్లానింగ్ అధికారులను నిర్మాణదారు దేవరాజ్ ప్రశ్నిస్తే స్థలం విషయంలో ఫిర్యాదు వచ్చిందని చెబుతున్నారని, ఆ ఫిర్యాదు చేసిందెవరూ? దానికి వివరాలు ఇస్తానని, అనుమతి ఇచ్చిన మీరే పనులకు అడ్డు తగలడం ఎంటని దేవరాజ్ మాటలకు అధికారుల నుంచి సమాధానం లేకపోవడం గమనార్హం.

సర్వత్రా విమర్శలు..

మున్సిపల్ నిబంధనల ప్రకారం తనకున్న 708 గజాల స్థలానికి అనుమతిని పొందిన తర్వాత కూల్చివేయడంపై అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటి నిర్మాణం అక్రమంగా చేపడితే ముందస్తుగా నోటీసులు ఇవ్వాలని వారికి తెలియదా? ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు? వారిపై రాజకీయ పరమైన ఒత్తిడిలు ఉంటే అనుమతితో నిర్మాణం చేపడుతున్న వాటిపై చర్యలు ఎందుకు తీసుకుంటున్నారు? ఇంటి అనుమతులిచ్చేటప్పుడు పత్రాలను, స్థలాన్ని చూడకుండానే ఇచ్చారా? స్థ లంపై వివాదం ఉంటే అనుమతి ఎందుకిచ్చారు? తప్పు ఎ వరు చేస్తే శిక్ష ఎవరికి వేస్తున్నారు? అధికారులు ఎందుకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ జోరుగా జరుగుతున్నది.

ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేశా
- దేవరాజ్

పైసా పైసా పోగు చేసుకుని నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపడుతుంటే అధికారులు తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అక్రమార్కులకు అండగా నిలుస్తూ నా స్థలాన్ని నాకు కాకుండా చేస్తున్నారని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. యూఎల్‌సీ, ఎల్‌ఆర్‌ఎస్, నిర్మాణ పర్మిషన్ కాపీలతో జీహెచ్‌ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ఇంటి పనులు మొదలు పెడితే కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనుమతి ఉన్నా ఎందుకు కూల్చివేస్తున్నారని ప్రశ్నిస్తే ల్యాండ్ విషయంలో ఫిర్యాదు వచ్చిందని చెబుతున్నారే తప్ప.. అసలు ఫిర్యాదుదారుడి వివరాలు చెప్పమని అడిగితే అధికారులు ఎందుకు చెప్పడం లేదన్నారు. తాను నిబంధనల ప్రకారమే అనుమతిని తీసుకుని నిర్మాణాన్ని చేపడుతున్నామని, అనుమతి పత్రాలు చూపించినా.. అవేవి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాలని మండిపడ్డారు. తనకు న్యాయం జరిగే వరకు కుటుంబ సభ్యులతో కలిసి పోరాటం చేస్తానని, కమిషనర్ ఇలంబర్తి తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా దేవరాజ్ విజ్ఞప్తి చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

శ్రీధర్‌రావుపై గచ్చిబౌలిలో కేసు నమోదు

సంధ్య కన్‌స్ట్రక్షన్స్ ఎండీ సరనాల శ్రీధర్‌రావు మీద గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నంబర్ 124, 125లలోని ఎఫ్‌సీఐ కాలనీలో గల ప్లాట్ నంబర్ 84లో 700ల గజాల స్థలాన్ని గతకొన్ని సంవత్సరాల కిందట కొనుగోలు చేసిన ఉమా దేవరాజు అనే మహిళ, అప్పటి నుంచి పొజిషన్‌లో ఉండగా, అక్రమంగా ప్లాట్‌లోకి అక్రమంగా చొరబడి కబ్జా యత్నించినందుకు కేసు నమోదు చేశారు. ఖాజాగూడ భగీరథమ్మ చెరువులో మట్టి డంపింగ్ చేసి చెరువును పూడ్చేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు శ్రీధర్‌రావుపై మరో కేసు నమోదు చేశారు. బాధితుడు దేవరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు శ్రీధర్‌రావు, అతడి అనుచరులు వెంకటేశ్, సాయికుమార్‌రెడ్డిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 329/3, 324/4, 351/2, రెడ్‌విత్ 3,5ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.